


ఆలోచించి ఓటేయండి

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఆలోచించి ఓటేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనా రెడ్డి పిలుపునిచ్చారు. 8లో▶



ప్లాస్టిక్ పార్కులో షార్ట్ సర్క్యూట్

మహేశ్వరం మండల పరిధిలోని తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులో అప్‌స్కైలర్స్ ప్లాస్టిక్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 8లో▶

ప్రశాంతంగా డివిజనల్ అకౌంట్ ఆఫీసర్స్ పరీక్షలు

ఇబ్రహీంపట్నం: డివిజనల్ అకౌంట్ ఆఫీసర్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3,526 మంది అభ్యర్థులకుగాను ఫస్ట్ పేపర్‌కు 2,135 మంది, సెకండ్ పేపర్‌కు 2,109 మంది అభ్యర్థులు (60శాతం) హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారు.

న్యూస్‌రీల్

శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐగా లక్ష్మారెడ్డి



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐగా లక్ష్మారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ సీఐగా పని చేసి ఆయన శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐగా బాధ్యతలు తీసుకున్నారు. శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు కొత్తగా ఏర్పాటయ్యే మోకిల, కొల్లూర్ పోలీస్ స్టేషన్‌కు ఆయనే డిటెక్టివ్ సీఐగా పని చేయనున్నారు.

మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకోవాలి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నర్సింలు తదితరులు

షాద్‌నగర్: మహనీయుల జీవిత చరిత్రను అందరూ తెలుసుకోవాలని పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి నర్సింలు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం జాతర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బోయినపల్లి నర్సింలు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు సామేల్, సిర్సనోళ్ల బాల్‌రాజ్, సింగపాగ జంగయ్య, కృష్ణయ్య, సూర్యా నాయక్, గుట్ట శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నవ తెలంగాణ చైతన్య సమితి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నాయకులు అబ్దుల్ రబ్‌జామి, పెండ్యాల అనంతయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూలే, అంబేడ్కర్ ఆలోచన విధానాలను అమలు చేయాలన్నారు. అణగారిన వర్గాలన్నీ ఏకమై ఆత్మగౌరవ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నవనీత, తుప్పుడు నర్సయ్య, వెన్నెల, తుప్పుడు అంజమ్మ, భాగ్యలక్ష్మి, నర్సింహాచారి, దశరథ్, రూప్‌సింగ్, మయూర్, విజయ్, జంగయ్య, వీణాకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెల్తీ వాకథాన్

ఖైరతాబాద్: అరుదైన వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డీసీజెస్ (ఐఓఆర్‌డీ) ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా అవగాహన బైకథాన్, వాకథాన్‌లు నిర్వహించారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఐవోఆర్‌డీ అధ్యక్షులు, సీఈవో ప్రొఫెసర్ రామయ్యతో కలిసి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ సమాజంలో చాలా మందికి అరుదైన వ్యాధుల గురించి అవగాహన లేదని, వీటి గురించి అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అరుదైన వ్యాధులకు సంబంధించిన మందుల ధరలు తగ్గించే అంశంపై ప్రభుత్వం మందుల కంపెనీలతో చర్చలు జరుపుతోందన్నారు. ప్రొఫెసర్ రామయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటి వరకు 7 వేల అరుదైన వ్యాధులు గుర్తించారని, ప్రపంచ జనాభాలో 5 శాతం మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. వరల్డ్ రేర్ డిసీజెస్ డే సందర్భంగా ఈ సంవత్సరం 'షో యువర్ స్ట్రైప్స్ అండ్ షేర్ యువర్ కలర్స్' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, ఐవోఆర్‌డీ కార్యదర్శి డాక్టర్ కృష్ణాజీ రావు, అరుదైన వ్యాధులపై విజయం సాధించిన అనేక మందితో పాటు రోగులు వారి బంధువులు పాల్గొన్నారు.

కొత్త ఒర'బడి'

సర్కారు బడికి అమ్మానాన్నలు

- విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా నూతన కార్యక్రమం
- 'పేరెంట్ -టీచర్' మీటింగ్‌కు శ్రీకారం
- పైలెట్ ప్రాజెక్టుగా మూడు జిల్లాలు
- ఎంపికైన వాటిలో మనది కూడా..



పీటీఎం సమావేశానికి తండ్రికి పూలు ఇచ్చి ఆహ్వానిస్తున్న చిన్నారులు



ఆదిబట్ల పాఠశాలలో పేరేంట్స్-టీచర్ సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే 'మన ఊరు- మనబడి' ద్వారా మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి బాటలు వేసింది. పిల్లల చదువులో.. బడులను బాగుచేయడంలో తల్లిదండ్రుల పాత్ర సైతం ఉంటే బాగుంటుందని, నాణ్యమైన విద్య అందుతుందని భావించింది. ఈ క్రమంలో ఆంగ్ల భాషలో విద్యాబోధన, విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇందులో భాగంగా 'పేరెంట్ -టీచర్' మీటింగ్‌ను తీసుకొచ్చింది.

మార్గదర్శకాలు జారీ

పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని మొదటి దశలో విజయవంతం చేయడానికి రాష్ట్రంలో రంగారెడ్డి, యాదాద్రి, భద్రాది జిల్లాలను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించింది. మూడు రోజుల క్రితం మార్గదర్శకాలు జారీ చేసింది. మూడు జిల్లాల్లో 50 పాఠశాలల చొప్పున 150 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఇక్కడ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోంది. తల్లిదండ్రులు, సమాజాన్ని బడులకు అనుసంధానం చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఆశిస్తోంది.

విధివిధానాలు

- ప్రతీనెల మూడో శనివారం పాఠశాలలో తరగతి వారీగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి.
- ఒకవేళ మూడో శనివారం సెలవు దినం అయితే నాలుగో శనివారం రోజున సమావేశం నిర్వహించాలి.
- ప్రతీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఒక ఆహ్వానపత్రం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశానికి ఆహ్వానించాలి.

సమావేశ లక్ష్యాలు

- పాఠశాలను.. తల్లిదండ్రులు, సమాజంతో అనుసంధానం చేయడం.
- ప్రతి తరగతిలోని విద్యార్థుల ప్రగతి, వివిధ రంగాల్లో విద్యార్థులు కనబర్చిన సామర్థ్యాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేయడం.
- విద్యార్థుల విద్యాపరమైన, పాఠశాల సంస్థాత పరమైన అభివృద్ధిలో భాగస్వాములను చేయడం.

చర్చించే అంశాలు

- విద్యాపరమైన, సాంస్కృతికపరమైన అంశాల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలి.
- ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమం అమలుపై విషయ అవగాహన కల్పించాలి.
- మన ఊరు–మన బడి, ఆంగ్ల మాధ్యమ బోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.
- విద్యార్థుల హాజరు పెంపుదలకోసం తీసుకొనే చర్యలపై చర్చలు నిర్వహించాలి.
- విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులతో చర్చించాలి.
- పాఠశాల ప్రగతికి సూచనలు సలహాలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజన అమలుపై చర్చ జరపాలి.
- విద్యార్థులు ఇంటి వద్ద అభ్యసనం చేయడం కోసం తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలి.
- సమావేశం రోజున బాగ్ డే, బాలసభ వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.
- విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాలు, అవకాశాలు, స్కాలర్‌షిప్‌ల వంటి విషయాలను వారికి తెలియజేయాలి.

ప్రధానోపాధ్యాయుల బాధ్యతలు

- ప్రధానోపాధ్యాయుడు సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయ సంఘాల సభ్యులు తదితరులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేయాలి.
- తల్లిదండ్రుల సమావేశాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలి.
- సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు వంద శాతం హాజరయ్యేందుకు స్వయం సహాయ సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలి.
- ప్రభుత్వం నిర్దేశించిన అనెక్షర్‌లో తెలిపిన నెలవారీ అజెండా ప్రకారం ఆయా అంశాలపై చర్చ జరిపేలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి.
- ప్రతి సమావేశంలో చేసిన తీర్మానాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. వాటిపై తర్వాతి సమావేశంలో సమీక్షించాలి.

ఉపాధ్యాయుల బాధ్యతలు

- ఉపాధ్యాయులు విద్యార్థుల బలాలు, బలహీనతలను తరగతుల వారీగా గుర్తించాలి.
- విద్యార్థి వారీగా ప్రొఫైల్ తయారు చేయాలి.
- విద్యార్థుల ప్రగతిని తెలుపుతూ, పాఠశాలలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలు , ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈ, ఒలింపియాడ్స్, ఆన్‌లైన్ క్విజ్ వంటి వాటి గురించి తెలియపరచాలి.

అమలు చేస్తే అద్భుతాలే..



ప్రభుత్వం తీసుకొచ్చిన పీటీఎం ద్వారా ప్రభుత్వ బడులు బాగుపడతాయి. నిరంతరం తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉంటే ఉపాధ్యాయుల్లోనూ కొంతైనా సామాజిక సేవ చేయాలనే తపన పెరుగుతుంది. విద్యార్థులకు చక్కగా విషయ పరిజ్ఞానంపై బోధించేలా పని చేస్తారు. విద్యార్థులకు సైతం తల్లిదండ్రులు ఎప్పుడు వచ్చి పర్యవేక్షిస్తారోనన్న భయం ఉంటుంది. అప్పుడే బాగా చదువుతారు.

– వర్కాల పరమేష్, ప్రధానోపాధ్యాయుడు

చాలా మంచి కార్యక్రమం



ప్రభుత్వం విద్యను ఆధునీకరించడం కోసం కృషి చేస్తోంది. ఇప్పటికే మన ఊరుమనబడి ద్వారా నిధులు కేటాయించింది. మోడల్ స్కూల్స్‌గా తయారవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాగే చేస్తే బాగుంటుంది. రంగారెడ్డి జిల్లాను పైలెట్‌ప్రాజెక్టుగా తీసుకోవడం అభినందనీయం. ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరం కృషి చేద్దాం. పేద పిల్లలకు న్యాయం జరుగుతుంది.

– మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, ఇబ్రహీంపట్నం

ధ్యానంతోనే మానసిక దృఢత్వం

- కేంద్ర సమాచార, ప్రసారాలు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్
- కాన్హాలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సెంటర్ ప్రారంభం



స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాగూర్ తదితరులు

నందిగామ: ప్రతి ఒక్కరూ ధ్యానం చేసినట్లయితే మానసికంగా ఎంతో ధృడంగా ఉంటారని కేంద్ర సమాచార, ప్రసారాలు, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్ అన్నారు. నందిగామ మండలంలోని కాన్హా శాంతి వనంలో ఆదివారం హార్ట్‌ఫుల్ నెస్ మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్, ఖేలో ఇండియా, ఎఫ్ఐటీ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ సంయుక్త సహకారంతో నిర్మించిన హార్ట్‌ఫుల్‌నెస్ అంతర్జాతీయ స్పోర్ట్స్ సెంటర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల్ల గోపీచంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, నిరంతరం ధ్యానం, యోగతో పాటు చిన్నపాటి వ్యాయామం దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ×ఫిట్‌నెస్ కా డోస్.. అరగంట మస్ట్‌× అనే నియమాన్ని పాటించాలన్నారు. కాన్హా శాంతి వనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన మందిరం, యోగా, క్రీడలు అన్నీ ఒకేచోట సమకూర్చడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నించాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శ్రీ రామచంద్ర మిషన్ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వాటికి ప్రభుత్వ మద్దతు ఉంటుందని చెప్పారు. బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఆవరణలో క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గురూజీ కమ్లేష్ పటేల్ ఆలోచన అద్భుతంగా ఉందన్నారు. ఈ కేంద్రంలో 14 బ్యాడ్మింటన్ కోర్టులు, 3 స్క్వాష్ కోర్టులు, 20 మీటర్ల స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ధ్యానం చేసినట్లయితే అంతర్గతంగా మార్పు వస్తుందన్నారు. నైపుణ్యం గల శిక్షకులతో ఇక్కడ క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా కృషి చేస్తామని అన్నారు. అంతకు ముందు గ్రీన్ కాన్హా రన్ నిర్వహించారు. 5కే, 10కే, 21కే రన్ విజేతలకు బహుమతులు అందజేశారు.



గ్రీన్ కాన్హా రన్‌లో పాల్గొన్న యువత

అపోలో ఆస్పత్రికి 'ఇస్రో' అవార్డు

బంజారాహిల్స్: నగరంలోని అపోలో ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగానికి ఇస్రో ప్రతిష్టాత్మక అవార్డును అందజేసింది. హెల్త్ క్వెస్ట్, పేషంట్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను అభివృద్ధి చేయడంలో సంస్థ అపారమైన సహకారానికి గుర్తింపుగా సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథన్ అపోలో ఆస్పత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ ఇమ్రాన్ సుభాన్‌కు ఈ అవార్డును అందజేశారు. అపోలో ఆస్పత్రి ఈ మేరకు సంబంధిత వివరాలను ఆదివారం వెల్లడించింది.

తల్లిని దూషించాడని స్నేహితుడి హత్య

బండరాయితో మోది.. బండరాళ్లలో పడేసిన వైనం



మృతుడు మహ్మద్ షా ఫైసల్ (ఫైసల్)




కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అంజయ్య

పహాడీషరీఫ్: తల్లిని దూషించడాన్ని తట్టుకోలేక స్నేహితుడిని దారుణంగా హతమార్చిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ అంజయ్య, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌తో కలిసి ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఉస్మాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాఫర్ కుమారుడు మహ్మద్ షా ఫైసల్ (25) ఈనెల 12న రాత్రి స్నేహితుడైన షాహీన్‌నగర్ మినార్ కాలనీకి చెందిన అబ్దుల్ జబ్బార్‌కు కాల్ చేసి అతని ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి కాసేపు ముచ్చటించారు. బయటకి వెళ్దామని అప్పటికే మద్యం తాగి ఉన్న ఫైసల్ అడగడంతో జబ్బార్ నిరాకరించాడు. దీంతో ఫైసల్ తల్లి పేరుతో తీవ్రంగా దూషించాడు. ఆగ్రహానికి గురైన జబ్బార్ కర్రతో బాదడంతో ఫైసల్ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే జబ్బార్ బండరాయితో మోది అతన్ని హత్య చేసి బండరాళ్లలో పడేసి.. మృతదేహం కనిపించకుండా చెత్తా చెదారంతోపాటు ఖాళీ సిమెంట్ సంచులను పడేసి వచ్చేశాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మొదట మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్‌పై నిఘా ఉంచగా.. సిమ్ మార్చి చాంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ షహీద్ వాడుతున్నట్లు తేలింది. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా జబ్బార్ నుంచి కొనుగోలు చేసినట్లు తేలింది. పోలీసులు జబ్బార్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు వినియోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

శివార్లకు రైట్ రైట్

- సిటీ బస్సుల విస్తరణ
- విద్యార్థుల కోసం అదనంగా 100 ట్రిప్పులు, ప్రత్యేక బస్సులు
- త్వరలో గ్రేటర్‌కు 500 ఎలక్ట్రిక్ బస్సులు
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో సకాలంలో బస్సులు లేక కాలేజీలకు వెళ్లలేకపోతున్న విద్యార్థులకు ఒకింత ఊరట. నగర శివార్లలోని విద్యాసంస్థలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో విద్యార్థులు సకాలంలో కాలేజీలకు చేరుకొనేవిధంగా, తిరిగి సాయంత్రం ఇళ్లకు వెళ్లేందుకు వీలుగా వివిధ ప్రాంతాలకు 100 ట్రిప్పులను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధికారులతో బస్ భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగర శివారు ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లే విద్యార్థుల రద్దీ, వివిధ రూట్‌లలో అందుబాటులో ఉన్న సిటీ బస్సుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులను క్షేమంగా విద్యా సంస్థలకు చేర్చడాన్ని టీఎస్ఆర్టీసీ సామాజిక బాధ్యతగా భావిస్తుందన్నారు.

12 కారిడార్‌లలో సిటీబస్సులు

గ్రేటర్ శివారు ప్రాంతాల్లోని కాలేజీలకు వెళ్లే విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 350 బస్సులను నడుపుతున్నారు. నగరానికి నాలుగువైపులా 12 కారిడార్‌లలో ఈ బస్సులు నడుస్తున్నాయి. ఇబ్రహీంపట్నం వైపు విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. ఈ రూట్‌లో ఉన్న కాలేజీలకు సుమారు 44 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వారిలో మూడో వంతు బస్‌పాస్‌లు తీసుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ రూట్‌లో ఉన్న రద్దీ మేరకు వారం రోజులుగా ట్రిప్పుల సంఖ్యను పెంచినట్లు ఎండీ చెప్పారు. ఇప్పుడు 8 ట్రిప్పులు అదనంగా పెంచారు. డిమాండ్‌మేరకు బస్సుల సంఖ్య పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. ఒక్క ఇబ్రహీంపట్నం రూట్‌లోనే 30 అదనపు ట్రిప్పులను నడపవలసిన అవసరం ఉన్నట్లు గుర్తించారు.

త్వరలో 500 ఎలక్ట్రిక్ బస్సులు

గ్రేటర్ హైదరాబాద్‌కు త్వరలో 500 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విద్యా సంవత్సరం ముగిసే నాటికే ఈ బస్సులు రోడ్డెక్కనున్నట్లు సజ్జనార్ తెలిపారు. విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా కొన్ని బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పీవీ మునిశేఖర్, సీపీఎం కృష్ణకాంత్, సీటీఎం జీవనప్రసాద్, చీఫ్ ఇంజనీర్ ఐటీ రాజశేఖర్, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్ఎంలు వరప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బతుకులు ఆగం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితుల దీక్షకు మద్దతు



భూ నిర్వాసితుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఈటల రాజేందర్

అబ్దుల్లాపూర్‌మెట్: ఆంధ్రుల పాలనలోనే ఆగం అయ్యామనుకుంటే ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ప్రజల బతుకులు పూర్తిగా ఆగమైపోయాయని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని మైనింగ్‌జోన్‌లో భూములు కోల్పోతున్న బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల భూ నిర్వాసితులు తమకు నష్టపరిహారం చెల్లించాలంటూ 195 రోజులుగా చేపడుతున్న నిరాహారదీక్షకు ఆదివారం ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేనంబర్ 268లో మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులు చేపడుతున్న రైతు పోరాటానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వాలు పేదలకు అసైన్డ్ భూములు కేటాయించిన తర్వాత సర్వహక్కులు పేద రైతులకే ఉంటాయని, పట్టా భూములకు ఎంత ధరను చెల్లించి భూ సేకరణ చేస్తారో అలాగే అసైన్డ్ భూములకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న క్రషర్లనే వెంటనే మూసి వేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, మహిళలు, రైతులు 195 రోజులుగా తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా చేస్తుంటే అటు నాయకులు, ఇటు అధికారులు తొంగిచూడకపోవడం సిగ్గుచేటన్నారు.

వైద్య రంగంలో టెక్నాలజీని వినియోగించుకోండి

మంత్రి హరీశ్ రావు

గచ్చిబౌలి: వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీని డాక్టర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్ రావు సూచించారు. ఆదివారం గచ్చిబౌలిలోని లీ మెరీడియన్ హోటల్‌లో అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్, సిటిజన్స్ స్పెషాలిటీ హస్పిటల్ ఆధ్వర్యంలో 6వ మినిమల్ ఇన్వాసివ్ గైనిక్ ఆంకో సర్జరీ (ఎంజీఓఎస్) వర్క్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభ దశలో కేన్సర్‌ను గుర్తిస్తే మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మానవతా దృక్పథంతో రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారిందని, దేశం నలుమూలల నుంచి రోగులు వస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో వస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతగానో తోడ్పతుందన్నారు.

మెస్ చార్జీలు పెంచాల్సిందే

ఎంపీ ఆర్.కృష్ణయ్య



ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ: పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకులాలు, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం, యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్‌చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో ధరలకు అనుగుణంగా మెనూ ఉందన్నారు. ఇప్పుడు విపరీతంగా ధరలు పెరిగినందున దాని ప్రకారం హాస్టల్ విద్యార్థులకు మెనూ పెంచాలని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన రూ.1500 నుంచి 3000 వేల వరకు మెస్ చార్జీలు పెంచి విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని కోరారు. పాకెట్ మనీ బాలురకు 500, బాలికలకు 1000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలు పెంచకపోతే లక్షలాది మంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రతినిధి గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, విద్యార్థి సంఘం అధ్యక్షులు అన్విత్, అంజి, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



'కొండా'కు శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం బీజేపీ నేతలు భీమేందర్‌రెడ్డి, కొండా సహదేవ్‌రెడ్డి, కంజర్ల ప్రకాశ్, కొండా కృష్ణారెడ్డి ఆయన్ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి
- అట్టహాసంగా స్పోర్ట్స్, కల్చరల్ డే

ఇబ్రహీంపట్నం రూరల్: చదువుతో పాటు విద్యార్థులు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని నలంద గ్రామర్ స్కూల్ స్పోర్ట్స్, కల్చరల్ డేను వై కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వారి ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంఈఓ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటుగా ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. చిన్నారులను ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచుతూ ఇతర రంగాల్లో ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశం, వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ చంద్రకాంత్, వెంకట్రాంరెడ్డి, అశోక్‌గౌడ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న వెంకటరమణారెడ్డి, ఎంఈఓ వెంకట్‌రెడ్డి

కుమ్మరుల సమగ్రాభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌తోనే కులాలకు ప్రాధాన్యత దక్కిందని.. కులాలు సమగ్రాభివృద్ధి జరిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే సంకల్పంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నాడని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కుమ్మరుల ఆత్మ గౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మట్టిని నమ్ముకుని జీవనోపాధి పొందే వారే కుమ్మరులని అన్నారు. వారి సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో కుమ్మరి సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, కార్పొరేషన్ రుణాలు, ఇతర సంక్షేమ పథకాల్లో కుమ్మరులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. నందివనపర్తి కుమ్మరులు తయారు చేసే కుండలకు రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఉందన్నారు.

మొల్ల విగ్రహావిష్కరణ

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్ల విగ్రహాన్ని కుమ్మరి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడాల గణేశ్, యాచారం మండల అధ్యక్షుడు కొండాపురం శ్రావణ్‌కుమార్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

మొయినాబాద్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కుటుంబ పాలన, నైజాం పాలనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిలుకూరులో శనివారం రాత్రి కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల స్వరాష్ట్ర పాలనలో అవినీతి పెరిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదంటూ అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లలో చిలుకూరు పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4కోట్ల నిధులు అందాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ అవినీతి, అరాచక పాలతో ప్రజలు విసిగిపోయారని.. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల యువకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సహదేవ్, నాయకులు శ్రీరాములు, నర్సింహారెడ్డి, భీమేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, శేఖర్‌గౌడ్, సీతారాంరెడ్డి, లక్ష్మీపతియాదవ్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, మల్లారెడ్డి, నరేందర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్‌కు జాతీయ అవార్డు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కమ్మదనం గ్రామానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ శ్రీశైలం జాతీయ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో మోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషల్ ఎక్స్‌క్లూజివ్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు నృత్యాలు నేర్పిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకుగాను ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ప్రముఖ నటులు జుబేదా అలీ, సంధ్య జానక్, రామదాసు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న శ్రీశైలం

ఉపాధ్యాయులు ఆలోచించి ఓటేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనా రెడ్డి

షాద్‌నగర్: ఏ ఉపాధ్యాయ సంఘం నుంచి గెలిచినా అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న సంఘాల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యయులు ఆలోచించి ఓటేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనా రెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి మరిచారని గుర్తుచేశారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగులకు సమయానికి జీతాలు సైతం ఇవ్వలేకపోతోందని విమర్శించారు. కొత్త ఉద్యోగ సంఘాలు సీఎం కేసీఆర్‌కు తొత్తులుగా మారాయని ఆరోపించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని గెలిపించేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటును ఏవీఎన్ రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్, పాతపల్లి కృష్ణారెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, మనోహర్‌రెడ్డి, వంశీకృష్ణ, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, మల్చలం మురళి, చెట్ల వెంకటేశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్యాట అశోక్, శ్రీనివాస్‌చారి, అభిషేక్, రఘురాంగౌడ్, దొడల వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, సుధాకర్, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం తదితరులు

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడ గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణం ప్రారంభంలో భాగంగా ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ వారు మాట్లాడుతూ.. ఆలయాల్లో మానసిక ప్రశాంతతకు నిలయాలుగా మారాయన్నారు. ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలన్నారు. రెండు రోజులుగా ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిస్తోందని సర్పంచ్ లావణ్యశంకర్ తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులను సర్పంచ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు, వెంకటేశంగుప్తా, శైలజ, రహీమాబేగం, ఉప సర్పంచ్ సుదర్శన్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు ఎస్.వసంతం, ఎం.యాదగిరి, మానిక్యరెడ్డి, ఆగిరెడ్డి, అలీ, దయాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పార్కులో షార్ట్‌సర్క్యూట్

- మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది
- అగ్ని ప్రమాదంలో రూ.80లక్షల వరకు ఆస్తి నష్టం

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులో అప్‌సైక్లర్స్ ప్లాస్టిక్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం .. ప్లాస్టిక్ రేకులు, డోర్స్, డబ్బాలు, ఇతర ప్లాస్టిక్ మెటీరియల్స్ తయారు చేసే అప్‌సైక్లర్స్ ప్లాస్టిక్ పరిశ్రమలో ఆదివారం ఉన్నట్టుండి ఒక్క సారిగా అన్ని కీలలు ఎగిపడ్డాయి. దీంతో అక్కడ పని చేస్తున్న సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అధికారులు అగ్నిమాపక వాహనాలతో హుటాహుటిన పరిశ్రమకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు, పరిశ్రమ యజమాని భావిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రూ.50లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్ తెలిపారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మేకల మందపై కుక్కల దాడి

- పది జీవాలు మృత్యువాత
- బాధితుడికి నేతల సాయం

కడ్తాల్: మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో పది మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ మేరకు విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, రాధాకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ.10వేల చొప్పున బాధితుడు పడకంటి కృష్ణయ్యకు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గోపాల్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీకస్నానాయక్, వార్డు సభ్యులు, నాయకులు లింగం, మల్లేశ్, ప్రమీల, నర్యా, యాదగిరి, ధర్మ, భాస్కర్, శ్రీను, జితేందర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్ నాయక్